సాక్షి వైఎస్ఆర్ జిల్లా

శనివారం | 1 | ఫిబ్రవరి | 2025



నిబంధనలకు విరుద్ధంగా..

ప్రొద్దుటూరులో టీడీపీ కౌన్సిలర్ మురళీధర్ రెడ్డిని తాత్కాలిక చైర్మన్‌గా నిబంధనలకు విరుద్ధంగా ఎంపిక చేసి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. -8లో



చీనీ చెట్ల నరికివేత

తొండూరు మండలం ఇనగలూరు గ్రామంలో టీడీపీ నాయకుల మధ్య ఆధిపత్య పోరు నడుస్తోంది. ఒక వర్గానికి చెందిన వారి చీనీ చెట్లను మరో వర్గం వారు నరికివేశారు. -8లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
34.9/20.6

జిల్లాలో శుక్రవారం 20.6 – 34.9 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

పదో తరగతిపై ప్రత్యేక శ్రద్ధ

కడప ఎడ్యుకేషన్: పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, ఉత్తమ ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షేక్ షంషుద్దీన్ పేర్కొన్నారు. జిల్లాలోని బయలాజికల్, ఫిజికల్ సైన్సు ఉపాధ్యాయులకు శుక్రవారం కడపలో మారిన నూతన ప్రశ్నాపత్రం, బ్లూ ప్రింట్, సిలబస్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీఈబీ సెక్రటరీ విజయభాస్కర్‌రెడ్డి, ఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు సంబేపల్లెకు సీఎం రాక

రాయచోటి: ఎన్టీఆర్ పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంబేపల్లెకి రానున్నారు. ఆయన ఉదయం విజయవాడలోని గన్నవరం ఎయిర్‌పోర్ట్ నుంచి ప్రత్యేక విమానం ద్వారా మధ్యాహ్నం 12.05 గంటలకు కడప విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్ ద్వారా సంబేపల్లె మండల కేంద్రం పీఎస్ కాలనీ సమీపంలో హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. మధ్యాహ్నం అక్కడే ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారు. అనంతరం సంబేపల్లెలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం ఉంటుంది. ప్రజాప్రతినిధులతో సమావేశమవుతారు. ఇంటింటా పెన్షన్ల పంపిణీ, లబ్ధిదారులతో మాటామంతీ కార్యక్రమం ఉంటుంది. సాయంత్రం 3.50 గంటలకు కడప విమానాశ్రయానికి చేరుకొని ప్రత్యేక విమానం ద్వారా విజయవాడకు వెళతారు.

ఏపీజీబీ రూ.2 కోట్ల రుణాలు



ట్రాక్టర్ల పంపిణీ కార్యక్రమంలో బ్యాంకు అధికారులు

మైదుకూరు: ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో శుక్రవారం రూ.2 కోట్ల విలువైన పరికరాలను రుణాల కింద పంపిణీ చేశారు. స్థానిక బ్యాంకు ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో సరళ రుణ కేంద్రం తరఫున వివిధ రకాల పథకాల కింద ట్రాక్టర్లు, డ్రోన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీజీబీ ప్రాంతీయ కార్యాలయ సీనియర్ మేనేజర్ నాగేశ్వర్, బ్రాంచ్ సీనియర్ మేనేజర్ మదన్‌మోహన్, దువ్వూరు బ్రాంచ్ మేనేజర్ రమణ, సరళ, రుణ కేంద్ర సీనియర్ మేనేజర్ మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

మాఘ మాసం ▸ మంచి ముహూర్తం




ఏటా మాఘ మాసం మంచి ముహూర్తాలు మోసుకొని వస్తుంది. ఈ సారి కూడా శుభ గడియలు తెచ్చింది. దీంతో శుభకార్యాల సీజన్ మొదలైంది. ఊరువాడా సందడి కనిపిస్తోంది. పెళ్లి బాజా మోగింది. పచ్చని పందిళ్లు, ముత్యాల తలంబ్రాలు, పెద్దల దీవెనలతో జంటలు ఒక్కటవుతున్నాయి. అంతేకాదు గృహ ప్రవేశాలు, ఉపనయనాలు తదితరాలు విస్తృతంగా జరగనున్నాయి.

- జనవరి 30 నుంచి ప్రారంభం
- 40 రోజుల వరకు కార్యక్రమాలు
- వివాహాలు, గృహ ప్రవేశాల సందడి
- పలు రంగాల వారికి ఉపాధి



ఆధునికత ఉట్టి పడుతున్న పెళ్లి మంటపం



బద్వేలు: పెళ్లిళ్లు, గృహ ప్రవేశాలు తదితర శుభ కార్యక్రమాలకు ముందుగా గుర్తొచ్చేది మాఘ మాసమే. ఎందుకంటే ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభమైన తర్వాత మొదటగా వచ్చే శుభం కలిగే మాసంగా దీనిని పండితులు పరిగణిస్తారు. ఉత్తరాయణం పుష్య మాసంలో రావడంతో.. అది శూన్యమాసం కావడంతో శుభ కార్యక్రమాలు చేపట్టరు. గురువారం నుంచి మాఘ మాసం ప్రారంభం కాగా వివాహాది శుభ కార్యక్రమాల సందడి ఆరోజు నుంచే మొదలైంది. ఇప్పటికే రెండు, మూడు నెలల ముందు నుంచి సంబంధాలు కుదుర్చుకున్న జంటల తల్లిదండ్రులు.. మాఘ మాసం రావడంతో పెళ్లి పనుల్లో నిమగ్నమయ్యారు. పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో రాబోయే రోజులన్నీ బాజాభజంత్రీలతో మారుమోగనున్నాయి. ఒక్క పెళ్లిళ్లే కాకుండా గృహ నిర్మాణాల ప్రారంభం, శంకుస్థాపనలు, గృహ ప్రవేశాలు, ఉపనయనాలు, ఆడబిడ్డలకు ఒడి బియ్యం పోయటం, నిశ్చితార్థం తదితర కార్యాలకు వరుసగా 40 రోజుల వరకు ముహూర్తాలు ఉన్నాయని కలసపాడు మండల పురోహితులు వారణాశి వెంకటరమణ వరప్రసాద్ తెలిపారు.

విందుపై ప్రత్యేక దృష్టి

విందు లేనిదే పెళ్లి ఉండదు. దీనికి చాలా మంది అధిక ప్రాధాన్యత ఇస్తారు. భోజనాలు రుచిగా, శుచిగా ఉండాలని, బంధుమిత్రుల్లో మాటరాకూడదని భావిస్తారు. అందుకే ఎంత ఖర్చు అయినా వెనుకాడరు. ఉదయం టిఫిన్ నుంచి రాత్రి భోజనం వరకు.. పెళ్లి అయిపోయే వరకు సరఫరా చేసే క్యాటరింగ్ సంస్థలు చాలానే ఉన్నాయి. మెనూ ప్రకారం ఎంచుకున్న పదార్థాలను బట్టి ధర నిర్ణయిస్తారు.

పండుగలూ అధికమే

ఈ మాసంలో పండుగలు కూడా అధికంగానే ఉంటాయి. ఫిబ్రవరి 3న వసంత పంచమి, 4న రథసప్తమి, 8న భీష్మ ఏకాదశి, అంతర్వేది తీర్థం, లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం, 26న మహాశివరాత్రి వంటి పర్వదినాలు ఉన్నాయి. ఈ నెలంతా అన్ని వర్గాల వారికి సందడిగానే ఉంటుంది.

» కల్యాణ మండపాలకు డిమాండ్

రెండు, మూడు నెలల తర్వాత శుభ ముహూర్తాలు రావడంతో కల్యాణ మండపాలకు డిమాండ్ పెరిగింది. చాలా మంది ఇప్పటికే కల్యాణ మంటపాలు బుక్ చేసుకోవడంతో వాటికి డిమాండ్ పెరిగింది. మంటపాలు దొరకని వారు తమ ఇళ్ల వద్దనే వివాహాలు జరుపుకొనేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకుంటున్నారు. వివిధ రకాల శుభ కార్యక్రమాల సమయం ఆసన్నం కావడంతో వివిధ రకాల వ్యాపారాలు ఊపందుకున్నాయి. ప్రధానంగా పట్టువస్త్రాలు, బంగారు, అలంకరణ వస్తువులు, పూల వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి.

» ముహూర్తాలు

జనవరి 30, 31తోపాటు ఫిబ్రవరి నెలలో 2,3,7, 13,14,15,18,19, 20, 21,23,25 తేదీల్లో వివాహ ముహూర్తాలు ఉన్నాయి. 7,15,18, 20,22 తేదీల్లో ముహూర్తాలు మరింత బలమైనవని పండితులు చెబుతున్నారు. మార్చిలో 8 రోజులు, ఏప్రిల్‌లో 12 రోజులు, మేలో 10 రోజులు వివాహాలు, గృహ ప్రవేశాలు, శంకుస్థాపనలు, ఉపనయన ముహూర్తాలు ఉన్నాయని పంచాంగకర్తలు పేర్కొంటున్నారు. వరుస శుభకార్యక్రమాలతో పురుహితులకు డిమాండ్ పెరిగిపోయింది.

» పసిడి, పూల ధరలు పైపైకి..



మార్కెట్‌లో బంగారం ధర రోజురోజుకూ పెరుగుతోంది. ఎక్కడా ఇంత వరకు ఒక చోట స్థిరంగా నిలిచింది లేదు. పెళ్లి ముహూర్తాలు ఎక్కువగా ఉండటంతో వివిధ వస్తువులు, పూల ధరలు అమాంతం పెరిగాయి.

▸▸ డ్రోన్ ఫొటోగ్రఫీకి గిరాకీ



గగనతలం నుంచి అత్యంత క్వాలిటీతో ఫొటోలు, వీడియోలు తీయడం డ్రోన్ ఫొటోగ్రఫీ విశిష్టత. దీంతో దీనికి ఆదరణ పెరిగింది. డ్రోన్‌తో ఫొటోలు, వీడియోలు తీసేందుకు వ్యాపారులు ఒక్కో కార్యక్రమానికి రూ.15 వేల నుంచి రూ.25 వేల వరకూ తీసుకుంటున్నారు. దీనికి ప్రింటింగ్ ఖర్చులు అదనం.

▸▸ అనేక మందికి ఉపాధి



శుభకార్యాలు ప్రారంభం కావడంతో ప్రధానంగా పురోహితులు, సేమియానా సెట్టింగ్‌లు, బ్యాండ్ వాయిద్య కళాకారులు, ఫొటో, వీడియో గ్రాఫర్స్, ఆర్కెస్ట్రా, క్యాటరింగ్, బ్యూటీ పార్లర్ నిర్వహకులు, ట్రావెల్స్ ఏజెన్సీలకు డిమాండ్ ఏర్పడింది. అందువల్ల ఆయా వ్యాపార వర్గాల వారికి చేతినిండా పని లభించనుంది. శుభకార్యాలు వారి ఉపాధికి దోహద పడుతున్నాయి.

- వివాహం రెండు రోజుల కార్యక్రమం. వధూవరులను సిద్ధం చేయడం దగ్గర నుంచి పెళ్లయి మళ్లీ వారిని ఇంటికి తీసుకొచ్చే వరకూ మంగళ వాయిద్యాలు అవసరం ఉంటుంది. బ్యాండ్ మేళం వారు ఒక్కో కార్యక్రమానికి రూ.15 వేల నుంచి రూ.20 వేలు తీసుకుంటున్నారు.



ఈ నెలలో అధికంగా పెళ్లిళ్లు



మాఘ మాసంలో అధిక సంఖ్యలో పెళ్లిళ్లు ఉన్నాయి. ఒక్కొక్క రోజు గ్రామాల్లో కూడా రెండు, మూడు పెళ్లిళ్లు ఉన్నాయి. అయ్యగారు దొరకడం లేదు. అన్ని ఊర్లల్లో పెళ్లిళ్లు ఉండటం వల్ల ఇబ్బందిగా ఉంది. అందరికీ కార్యక్రమాలు సర్దుబాటు చేయాలి, కాబట్టి కింద మీద పడి కార్యక్రమాలు జరిపిస్తున్నాం.

-వి.వి.ఆర్.వి.ప్రసాద్ శర్మ, పురోహితుడు, కలసపాడు

సింహంపై నరసింహుడు



దేవునికడప ఆలయం వద్ద భారీగా భక్తజనం



సింహ వాహనంపై కడపరాయుడు

వైభవంగా కడప రాయుని బ్రహ్మోత్సవాలు

కడప కల్చరల్: కడప రాయుడు శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. అరాచకాలు సృష్టిస్తున్న దుష్టులను అంతం చేసి, శిష్ట రక్షణ చేసేందుకు దేవదేవుడు నరసింహుడై గర్జించాడు. శత్రువులను తునియలు చేసేందుకు విక్రమించాడు. ఆయుధ ధారియై పరాక్రమంతో వెళుతున్న ఆ పురుషోత్తముడిని చూసి భక్తులు తన్మయులయ్యారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం చిన్న శేష వాహనంపై మాడవీధుల్లో విహరించారు. ఈ సందర్భంగా మాడవీధుల్లోని భక్తులు తమ ఆరాధ్య దైవమైన కడప రాయుడు తమ ఇంటి ముంగిళ్లకే తరలి వచ్చి కరుణించే భాగ్యం ఇవ్వడంతో తన్మయులయ్యారు. పూజా ద్రవ్యాలు సమర్పించి మొక్కుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. వాహన సేవ అనంతరం స్వామి, అమ్మవార్లకు శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజన సేవ చేశారు. రాత్రి ఆలయ ప్రాంగణంలో కనుల పండువగా ఏర్పాటు చేసిన ఊయలపై సేద తీర్చారు. మంగళ వాయిద్యాలు, గాయకుల కమ్మని సంగీతం వింటూ స్వామి వింజామర సేవల మధ్య విశ్రమించారు. అనంతరం సింహంపై మలయప్పగా కడప రాయుడు నరసింహునిగా కొలువుదీరి భక్తులను కరుణించాడు. మహిళా భక్త బృందాలు పురుష బృందాలతో పోటీపడుతూ కోలాటాలు, భజనలు నిర్వహించారు. ప్రత్యేక వాయిద్య బృందాలు స్వామిని కీర్తిస్తూ సంగీతార్చన చేస్తూ ఊరేగింపుగా సాగారు.

నేడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం కల్పవృక్ష వాహనంపై స్వామి తిరుమాడవీధుల్లో భక్తులకు దర్శనభాగ్యం కలిగించనున్నారు. ఉదయం 10.30 గంటలకు స్నపన తిరుమంజనం, సాయంత్రం 6 గంటలకు ఊంజల సేవ, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుల కీర్తనల ఆలాపనలు నిర్వహిస్తారు. రాత్రి 8 గంటల నుంచి హనుమంతవాహనంపై స్వామి వారి ఊరేగింపు ఉంటుంది.

గండికోట అభివృద్ధికి ప్రణాళిక

కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

కడప సెవెన్‌రోడ్స్: గండికోట పర్యాటక అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలులో గండికోట పర్యాటక అభివృద్ధిలో భాగంగా సుప్రసిద్ధ ఒబేరాయ్ హోటల్ నిర్మాణానికి సంబంధించి ఆ సంస్థ వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ నహర్ జీ, సంబంధిత ప్రాజెక్టు అభివృద్ధి ఏజెన్సీలతో కలిసి కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ, జమ్మలమడుగు తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి, ఏపీటీడీసీ ఎస్.ఈ. ఈశ్వరయ్య, ఎస్టేట్ ఆఫీసర్ రాంప్రసాద్, జిల్లా టూరిజం అధికారి సురేష్ కుమార్, ఇరిగేషన్ అధికారులు, కన్సల్టెంట్స్ శివ, సాజిద్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ శ్రీధర్

- జిల్లాలో వివిధ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని బోర్డ్ రూమ్ హాలులో పెండింగ్ కేసులపై లా ఆఫీసర్స్‌తో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. డీఆర్‌ఓ విశ్వేశ్వర నాయుడు, కడప ప్రభుత్వ ప్లీడర్ శివశంకర్‌రెడ్డి, ప్రొద్దుటూరు అసిస్టెంట్ ప్రభుత్వ ప్లీడర్ పవన్ కుమార్‌రెడ్డి, బద్వేలు అసిస్టెంట్ ప్రభుత్వ ప్లీడర్ సూర్యనారాయణరెడ్డి, మైదుకూరు అసిస్టెంట్ ప్రభుత్వ ప్లీడర్ నరసింహ శర్మ, బద్వేల్ ఆర్డీవో చంద్రమోహన్, పులివెందుల ఆర్డీవో చిన్నయ్య, జమ్మలమడుగు ఆర్డీఓ సాయిశ్రీ తదితరులు పాల్గొన్నారు.
- 'నేషనల్ క్లీన్ ఎయిర్' కార్యక్రమంపై సంబంధిత అధికారులతో కలెక్టర్ శ్రీధర్ సమావేశం నిర్వహించారు. కడప మున్సిపల్ కమిషనర్ మనోజ్‌రెడ్డి, జిల్లా కాలుష్య నియంత్రణ ప్రాంతీయ అధికారి సుధ కురబ, ఏఈ అనిల్‌కుమార్‌రెడ్డి, జీఎం డీఐసీ చంద్ బాషా, జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు, డీఎస్ఓ, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ చెన్నకేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● జై వాసవాంబ



ప్రొద్దుటూరులో వాసవీమాత మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకరణ

ప్రొద్దుటూరు కల్చరల్/ రాజంపేట టౌన్: 'వాసవీమాతాకీ జై' అంటూ భక్తులు ప్రణమిల్లారు. 'మమ్మల్ని చల్లగా చూడు తల్లీ' అని వేడుకున్నారు. శుక్రవారం వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాల్లో ఈ కార్యక్రమాన్ని ఆర్యవైశ్యులు వేడుకగా చేపట్టారు.



రాజంపేటలో గుండ ప్రవేశం చేస్తున్న భక్తులు

రిజిస్ట్రేషన్ కార్యాలయాలు కిటకిట



కడప సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం బయట వేచి ఉన్న క్రయవిక్రయదారులు



జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో సందడి

నేటి నుంచి రిజిస్ట్రేషన్ చార్జీల పెంపు ఎఫెక్ట్

కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లాలో రిజిస్ట్రేషన్‌కార్యాలయాలు కొన్ని రోజులుగా కిటకిటలాడుతున్నాయి. ఫిబ్రవరి 1 నుంచి కొత్త రిజిస్ట్రేషన్ చార్జీలు అమలులోకి రానున్న నేపథ్యంలో ఈ పరిస్థితి నెలకొంది. పాత చార్జీలకు చివరి రోజైన శుక్రవారం రిజిస్ట్రేషన్‌కార్యాలయాలకు క్రయవిక్రయదారుల తాకిడి మరింత పెరిగింది. ఒక వైపు సర్వర్ కాస్త సతాయిస్తుండగా.. ఉదయం నుంచి సాయంత్రం వరకు పత్రాలు చేతబట్టి రిజిస్ట్రేషన్లకు ఎగబడ్డారు. మరోవైపు కొంతమంది దళారులు ఒక్కో డాక్యుమెంటుకు ఒక్కో రీతిలో వసూళ్లకు పాల్పడ్డారు. ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చార్జీలను పెద్ద మొత్తంలో పెంచడంతో.. కొనుగోలుదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం పడిపోతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

గంజాయి విక్రయిస్తున్న మహిళ అరెస్టు

అట్లూరు : గంజాయి విక్రయిస్తున్న మహిళను అరెస్టు చేసి ఆమె వద్ద నుంచి 1100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు బద్వేలు రూరల్‌ సీఐ నాగభూషణ్‌, స్థానిక ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. వివరాలిలా..కడప పట్టణం మాసాపేటకు చెందిన పూల లక్ష్మీదేవి నెల రోజుల క్రితం కొండూరు ఎస్సీ కాలనీలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుంది. ఇక్కడి నుంచి కడపకు తీసుకెళ్లి గంజాయి విక్రయించేది. శుక్రవారం ఎస్సీకాలనీలో ఉన్న గంగమ్మ గుడి దగ్గర ఆమెను పోలీసులు అదుపులోకి తీసుకుని పెద్దమునుషుల సమక్షంలో తనిఖీ చేయగా 1100 గ్రాముల గంజాయి లభించింది. కేసు నమోదు చేసి ఆమెను పోలీసులు కోర్టుకు హాజరు పరిచినట్లు తెలిపారు.

వర్రాపై కేసు తెలంగాణ నుంచి పులివెందులకు బదిలీ

– అర్బన్‌ సీఐ నరసింహులు

పులివెందుల రూరల్‌ : వైఎస్సార్‌సీపీ సోషల్‌ మీడియా కార్యకర్త వర్రా రవీంద్రా రెడ్డిపై మాజీ మంత్రి వివేకానందరెడ్డి కుమార్తె సునీత పెట్టిన కేసు పులివెందులకు బదిలీ చేసినట్లు అర్బన్‌ సీఐ నరసింహులు తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో గత ఏడాది ఫిబ్రవరి 2వ తేదీన హైదరాబాద్‌ సైబర్‌ పోలీస్‌ స్టేషన్‌లో వైఎస్‌ సునీత ఫిర్యాదు చేసిందని, వారు విచారించి ఈ కేసును పులివెందులకు బదిలీ చేశారన్నారు.

లాడ్జీలో వ్యభిచారం.. పోలీసుల దాడి

జమ్మలమడుగు రూరల్‌ : ముద్దనూరు రహదారిలో ఉన్న ఓ లాడ్జిలో వ్యభిచారం జరుగుతున్నట్లు అందిన సమాచారం మేరకు పట్టణ సీఐ ఎస్‌. లింగప్ప సిబ్బందితో కలసి శుక్రవారం దాడి నిర్వహించారు. సీఐ తెలిపిన వివరాలు ఇలా.. ముద్దనూరు రహదారిలో ఉన్న లాడ్జీలో ఇతర ప్రదేశాల నుంచి అమ్మాయిలను పిలిపించి వ్యభిచారం నిర్వహిస్తుండటంతో లాడ్జీ ఓనర్‌ చప్పిడి విజభాస్కర్‌రెడ్డిని అరెస్ట్‌ చేసినట్లు తెలిపారు. జమ్మలమడుగు పట్టణ పరిధిలోని లాడ్జీలో అసాంఘిక కార్యాకాలాపాలు నిర్వహించినట్లు తెలిస్తే లాడ్జీల యజామానులపై చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

రాయలసీమ హామీలను మరచిన ప్రభుత్వాలు

అట్లూరు : విభజన చట్టంలోని హామీలను కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు మరచాయని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌, రాజామణి పేర్కొన్నారు. సీపీఎం 27వ రాష్ట్ర మహా సభలు నెల్లూరులో నిర్వహించనున్న నేపథ్యంలో అట్లూరు మండల పరిధిలోని అట్లూరు క్రాస్‌రోడ్డులో శుక్రవారం జీపుజాత నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 2014లో విభజన చట్టంలోని షెడ్యూల్‌ 13లో పొందుపరచిన విధంగా కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి అనంతరం విస్మరించారన్నారు. విభజన చట్టంలో పొందుపరచిన హామీలన్నీ నెరవేర్చాలని ఉద్యమాలకు శ్రీకారం చుట్టామన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు రమణ, రవిచంద్రా, నిత్యా, గోపయ్య తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్‌పై ఎస్పీ కొరఢా

- మట్టి తరలిస్తున్న 6 టిప్పర్లు, ట్రాక్టర్‌ సీజ్‌
- అనుమతులున్నాయని బుకాయించిన అధికార పార్టీ నేతలు
- మూడు రోజులుగా పోలీస్‌స్టేషన్‌లోనే వాహనాలు



చిన్నచౌకు పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చిన టిప్పర్లు

కడప కార్పొరేషన్‌ : జిల్లా నూతన ఎస్పీ ఈజీ అశోక్‌ కుమార్‌ పాలనలో తన మార్కు చూపిస్తున్నారు. ఎస్పీ నేతృత్వంలో పోలీసులు అక్రమ మైనింగ్‌పై కొరఢా ఝుళిపించారు. జిల్లా కేంద్రమైన కడపలో చిన్నచౌకు పోలీస్‌స్టేషన్‌ పరిధిలో అక్రమంగా గ్రావెల్‌, మట్టి తోలుతున్న ఆరు టిప్పర్లు, ఒక ట్రాక్టర్‌ను సీజ్‌ చేశారు. ఇవన్నీ కూడా అధికార పార్టీ నేతలవే కావడం గమనార్హం. వీటిని పోలీసులు పట్టుకునే క్రమంలో వారు తమకు అన్ని అనుమతులు ఉన్నాయని బుకాయించినట్లు సమాచారం. అనుమతులన్నీ సక్రమంగా ఉంటే మూడు రోజులుగా ఈ వాహనాలు పోలీస్‌స్టేషన్‌లో ఎందుకున్నాయని పలువురు గుసగుసలు పోతున్నారు. వాస్తవానికి చలమారెడ్డిపల్లె, నానాపల్లె సమీపంలోని కొండపై మూడు క్వారీలకు అనుమతి ఉంది. అయితే వీటిలో వేటికి కూడా మైనింగ్‌ అధికారులు మట్టి తవ్వేందుకు అనుమతి ఇవ్వలేదు. కానీ అధికార పార్టీ నేతలు మాత్రం మూడు గ్రూపులుగా ఏర్పడి కిలోమీటర్ల మేర కొండను తవ్వేస్తూ లక్షల క్యూబిక్‌ మీటర్ల గ్రావెల్‌, మట్టిని అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమ మైనింగ్‌పై 'సాక్షి'లో పలు సార్లు కథనాలు వచ్చినప్పటికీ అధికారులు తాత్కాలికంగా పట్టుకోవడం, వదిలేయడం పరిపాటిగా మారింది. అధికారులు పట్టుకున్న మరుసటి రోజు నుంచే మళ్లీ అక్రమ రవాణా సాగుతుందంటే మైనింగ్‌ మాఫియా దందా ఎలా సాగుతుందో అర్థం చేసుకోవచ్చు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి టీడీపీ నేతలు మట్టి అక్రమ రవాణాపైనే ఎక్కువ ఫోకస్‌ పెట్టి లక్షలాది రూపాయలు ఆర్జించినట్లు తెలుస్తోంది. ఈ 8 నెలల్లో అది కోట్లకు చేరినట్లు సమాచారం. అటు మైనింగ్‌, ఇటు రెవెన్యూ అధికారులు ఎవరూ వారిని నిలువరించే సాహసం చేయలేకపోతున్నారనే విమర్శలు ఉన్న నేపథ్యంలో ఎస్పీ ఆదేశాల మేరకు చిన్నచౌకు పోలీసులు ఈ టిప్పర్లను పట్టుకోవడం హాట్‌ టాపిక్‌గా మారింది. ఇటీవల జరిగిన పరిణామాలను క్షుణ్ణంగా పరిశీలన చేసిన ఎస్పీ అడుగడుగునా నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశాలిచ్చి ...అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని పోలీసులకు విస్పష్టమైన సంకేతాలిచ్చినట్లు సమాచారం. దీంతో ఇకపైనైనా అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడుతుందేమోనని పలువురు భావిస్తున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా తాత్కాలిక చైర్మన్‌ ఎన్నిక

చైర్‌పర్సన్‌ వాయిదా వేసినా సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే వరద



టీడీపీ కౌన్సిలర్‌ భర్త జంబాపురం రామాంజనేయరెడ్డిని వారిస్తున్న కాంట్రాక్టర్లు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మున్సిపల్‌ బడ్జెట్‌ సమావేశాన్ని శుక్రవారం చైర్‌పర్సన్‌ భీమునిపల్లి లక్ష్మీదేవి అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా తెలిపిన మేరకు సాధారణ సమావేశాన్ని మాత్రం ఫిబ్రవరి 21వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించి వేదికపై నుంచి దిగి వెళ్లిపోయారు. గురువారం చైర్‌పర్సన్‌ ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. అయితే సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఆదేశాల మేరకు నిబంధనలకు విరుద్ధంగా తమ సభ్యులతో కలసి తాత్కాలిక చైర్మన్‌గా ఐదో వార్డు టీడీపీ కౌన్సిలర్‌ను వంగనూరు మురళీధర్‌రెడ్డిని ఎంపిక చేసి సమావేశం నిర్వహించారు. నిబంధనల ప్రకారం చైర్‌పర్సన్‌, వైస్‌ చైర్మన్లు లేని సమయంలో ప్యానల్‌ చైర్మన్లుగా ఉన్న వారిని సమావేశం వరకు తాత్కాలిక చైర్మన్‌ను ఎన్నుకోవచ్చు. వాస్తవానికి మురళీధర్‌రెడ్డి తాత్కాలిక చైర్మన్‌ జాబితాలో లేరు. అధికార బలంతో ఇలా చేశారు. చైర్‌పర్సన్‌ వేదికపై నుంచి వెళుతుంటే టీడీపీ కౌన్సిలర్లు చైర్‌పర్సన్‌ డౌన్‌ డౌన్‌ అంటూ నినాదాలు చేశారు. ఎందుకు వెళ్లిపోతున్నారని ఎమ్మెల్యే చైర్మన్‌ను ప్రశ్నించారు. కొంత మంది కౌన్సిలర్లు చైర్‌పర్సన్‌ అనే గౌరవం లేకుండా ఏకవచనంతో సంబోధించారు. మురళీధర్‌రెడ్డిని వేదికపై కూర్చోబెట్టి సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. అజెండాలోని అన్ని అంశాలపై చర్చించారు. ఈ విషయంపై మున్సిపల్‌ కమిషనర్‌ మల్లికార్జునను వివరణ కోరగా నిబంధనల ప్రకారం ప్యానల్‌ కమిటీలో ఉన్న వారిని తాత్కాలిక చైర్మన్‌ను ఎన్నుకోవాల్సి ఉందన్నారు. అయితే 2021లో ఏర్పాటు చేసిన ప్యానల్‌ కమిటీలో పేర్లు ఉన్నట్లు మినిట్స్‌ పుస్తకంలో రాయలేదన్నారు. 13వ వార్డు కౌన్సిలర్‌ ఇర్ఫాన్‌ బాషా, 31వ వార్డు కౌన్సిలర్‌ మీగడ దీప్తితోపాటు మరో కౌన్సిలర్‌ ప్యానల్‌ కమిటీలో తమ పేర్లు ఉన్నట్లు తెలిపారన్నారు. వారి పేర్లు కూడా పుస్తకంలో లేవన్నారు. ఈ కారణంగా సమావేశంలో ఉన్న సభ్యులు తాత్కాలిక చైర్మన్‌గా మురళీధర్‌రెడ్డిని ఎన్నుకుని సమావేశాన్ని నిర్వహించారన్నారు. బడ్జెట్‌ సమావేశానికి 35 మంది కౌన్సిలర్లు హాజరు కాగా, సాధారణ సమావేశానికి 19 మంది కౌన్సిలర్లు హాజరయ్యారు.

అధికారులకు నిబంధనలు పట్టవా?

నిబంధనల ప్రకారం ఆయన మున్సిపల్‌ కౌన్సిల్‌ సమావేశంలోకి రావడానికి ఎలాంటి అర్హత లేదు. అలాంటిది సమావేశంలోకి వచ్చి కూర్చోవడంతో పాటు ఏకంగా అధికారులనే దూషించిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ప్రొద్దుటూరు మున్సిపల్‌ కౌన్సిల్‌ బడ్జెట్‌ సమావేశం చైర్‌పర్సన్‌ భీమునిపల్లి అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఎక్స్‌అఫిషియో సభ్యుని హోదాలో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి హాజరయ్యారు. నిబంధనల ప్రకారం బడ్జెట్‌ సమావేశం ముగిసిన అనంతరం చైర్‌పర్సన్‌ సాధారణ సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించి వెళ్లిపోయారు. సాధారణ సమావేశం అనంతరం కౌన్సిలర్లు కొంత మంది మినిట్స్‌ పుస్తకంలో సంతకాలు చేయకుండా వెళ్లిపోతున్నారని భావించి అక్కడే ఉన్న మూడో వార్డు టీడీపీ కౌన్సిలర్‌ భర్త జంబాపురం రామాంజనేయరెడ్డి కౌన్సిలర్లు వెళ్లిపోతుంటే అధికారులు గాడిదలు కాస్తున్నారా అని ఆగ్రహంతో అన్నారు. లోపలికి రావడానికి నీకు ఎవరు అధికారం ఇచ్చారని కమిషనర్‌ రామాంజనేయరెడ్డిని ప్రశ్నించారు. కమిషనర్‌తోపాటు అధికారులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపేందుకు ప్రయత్నించగా టీడీపీ నేతలు సర్దుబాటు చేసినట్లు తెలుస్తోంది.

అగ్ని ప్రమాదం.. చిల్లర దుకాణం దగ్ధం

మైదుకూరు : మున్సిపాలిటీ పరిధిలోని ఎల్లంపల్లెలో శుక్రవారం షార్ట్‌ సర్క్యూట్‌ కారణంగా జరిగిన అగ్ని ప్రమాదంలో ఇమామ్‌ హుస్సేన్‌ అనే వికలాంగుడికి చెందిన చిల్లర దుకాణం దగ్ధమైంది. బాధితుడు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఇంటిలో చిల్లర దుకాణం పెట్టుకున్న ఇమామ్‌ హుస్సేన్‌ గ్రామంలోనే మరో చోట టిఫిన్‌ సెంటర్‌ నిర్వహిస్తున్నాడు. శుక్రవారం ఉదయం పిల్లలు పాఠశాలకు వెళ్లిన తర్వాత ఇమామ్‌ హుస్సేన్‌ ఆయన భార్య ఇంటికి తాళం వేసి టిఫిన్‌ సెంటర్‌ వద్దకు వెళ్లారు. ఉదయం 9 గంటల ప్రాంతంలో చుట్టుపక్కల వారు ఇంట్లో నుంచి పొగలు వస్తున్నాయని చెప్పడంతో భార్యాభర్తలు హుటావుటీన ఇంటి వద్దకు వెళ్లారు. తలుపులు తీసి చూడగా చిల్లర దుకాణంలోని వస్తువులు పక్కనే ఉన్న వాషింగ్‌ మిషన్‌ ఇతర వస్తువులన్నీ కాలిపోయాయి. దుకాణంలోని క్యాష్‌ పెట్టెలో ఉన్న రూ.16వేలు నగదు కూడా అగ్నికి ఆహుతి అయింది. చుట్టుపక్కల వారు మంటలను ఆర్పి వేయడంతో ఇంటిలోని రెండో గదికి మంటలు వ్యాపించలేదు. కాలిపోయిన ఇంటిని రెవెన్యూ అధికారులు పరిశీలించారు.

చెర్లోపల్లె అక్రమ రిజిస్ట్రేషన్లపై ఫిర్యాదు

చింతకొమ్మదిన్నె : మండల పరిధిలోని చెర్లోపల్లె లేఅవుట్‌ లోని ఇళ్లకు సంబంధించి గతంలో పనిచేసిన పంచాయతీ సెక్రటరీ ఓబులేసు సంతకాన్ని ఫోర్జరీ చేసి కొన్ని ముఠాలు అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడుతున్నారని పోలీస్‌ స్టేషన్లో పాపాసాహెబ్‌ పేట ప్రస్తుత పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసులు గురువారం సాయంత్రం ఫిర్యాదు చేశారు. విషయం తెలిసి పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసులును వివరణ కోరగా మునుపు పని చేసిన పంచాయతీ సెక్రటరీ ఓబులేసు సంతకాన్ని ఫోర్జరీ చేసి అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేసుకున్నట్లు సమాచారం రావడంతో పరిశీలించామన్నారు. గత పంచాయతీ సెక్రటరీ సంతకాన్ని, పంచాయతీ కార్యాలయ ముద్రలను ఫోర్జరీ చేసినట్లు, కారకులైన పొన్నేరు సుబ్రహ్మణ్యం, చిట్టిబాబు అనే వ్యక్తులు, ఇతర అనుమానితుల పైన చింతకొమ్మదిన్నె పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేసినది వాస్తవమేనని తెలిపారు.

ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టాలి

– డీఎఫ్‌ఓ వినీత్‌కుమార్‌

అట్లూరు : ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టాల్సిన ఆవశ్యకత మనందరిపై ఉందని డీఎఫ్‌ఓ వినీత్‌కుమార్‌ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన సిబ్బందితో కలిసి లంకమల అభయారణ్య పరిధిలోని కలివికోడి ఆవాస ప్రాంతంతో పాటు బేస్‌క్యాంపులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో అరుదైన కలివికోడి అట్లూరు మండల పరిధిలోని కొండూరు బీటు మత్తాయికుంట సమీపంలో గతంలో పట్టుబడిందన్నారు. లంకమల్లేశ్వర అభయారణ్యంలో ఎర్రచందనం విస్తృతంగా ఉందని, ఈ ఎర్రచందనం అక్రమ రవాణా కాకుండా అరికట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఆయన తెలిపారు. అనంతరం పత్తివానిబావి సమీపంలోని బేస్‌క్యాంపుతో పాటు కలివికోడి ఆవాస ప్రాంతంలో ఏర్పాటు చేసిన అధునాతన కెమెరాలను పరిశీలించి సిబ్బందికి తగు సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో సిద్దవటం ఎఫ్‌ఆర్‌ఓ కళావతి, సెక్షన్‌ ఆఫీసర్‌ సురేష్‌బాబు, బీట్‌ ఆఫీసర్‌ విశ్వనాథరెడ్డి, ప్రొటెక్షన్‌ వాచర్‌ రమణ తదితరులు పాల్గొన్నారు.

బోటానికల్‌ గార్డెన్‌ను సందర్శించిన వర్ల

కడప ఎడ్యుకేషన్‌ : ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్‌ వర్ల శుక్రవారం యోగివేమన యూనివర్సిటీలో బోటానికల్‌ గార్డెన్‌ను సందర్శించారు. గార్డెన్‌లో అతిపెద్దదైన విక్టోరియా అమెజానికల్‌ పత్రాన్ని పరిశీలించి ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. వైవీయూలో 20 ఎకరాల్లో బోటానికల్‌ గార్డెన్‌ను ఏర్పాటు చేయడం, అంతరించి పోతున్న వృక్షాల సంరక్షణను చూస్తుంటే ఇక్కడ వృక్షాల పట్ల ఎంతశ్రద్ధ ఉందో అర్థమవుతుందన్నారు. బోటానికల్‌ గార్డెన్‌ సంరక్షిస్తున్న ఇన్‌చార్జ్‌ మధుసూధన్‌రెడ్డిని అభినందించారు. ఈయన వెంట ప్రముఖ డెంటిస్టు డాక్టర్‌ శ్రీధర్‌రెడ్డి ఉన్నారు.

స్వయం ఉపాధి రుణాలకు దరఖాస్తు చేసుకోండి

బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు పీవీఎస్వీ ప్రసాదరావు



వేంపల్లె : ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం మంజూరు చేసిన సబ్సిడీ రుణాలకు అర్హులైన బ్రాహ్మణ యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవాలని బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు పీవీఎస్వీ ప్రసాదరావు శుక్రవారం ఒకప్రకటనలో కోరారు. బీసీ కార్పొరేషన్‌ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసి రుణాలు మంజూరు చేస్తారన్నారు. ఏపీ ఓబీఎంఎంఎస్‌ వెబ్‌సైట్‌లో ఫిబ్రవరి 7వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్‌ ద్వారా 9 మందికి, ఈబీసీ ద్వారా జిల్లాలో 74 మందికి రుణాలు ఇస్తారని తెలిపారు. వార్షిక ఆదాయం రూ.3లక్షల లోపు ఉన్న వారు ఈబీసీలుగా పరిగణిస్తారన్నారు. ఆ మేరకు తహసీల్దార్‌ నుంచి ఈబీసీ సర్టిఫికెట్‌ పొందవచ్చునని, అర్హులైన వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను జత చేయాలన్నారు. వెబ్‌సైట్‌లో నమోదు చేసిన తర్వాత దరఖాస్తును ప్రింట్‌ తీసుకొని సంబంధిత సచివాలయంలో ఇవ్వాల్సి ఉంటుంది. ఫిబ్రవరి 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకు ఇంటర్వ్యూలు నిర్వహించి, మార్చిలో సబ్సిడీని బ్యాంకు లోన్‌కు జత చేసి ఇస్తారన్నారు. త్వరితగతిన అవసరమైన సర్టిఫికెట్లను పొంది దరఖాస్తు చేసుకోవాలన్నారు.

తరగతుల తరలింపు ప్రభుత్వానికి తగదు

ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర రెడ్డి



వేంపల్లె : గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక పాఠశాలల నుంచి 3, 4, 5తరగతుల తరలింపు సరైన చర్య కాదని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగమేశ్వరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. గత ప్రభుత్వం విడుదల చేసిన 117 జీవో వలన ప్రాథమిక పాఠశాల వ్యవస్థ నిర్వీర్యమైందని, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు 117 జీవో రద్దు కోరుకున్నారన్నారు. ఆనాడు 3, 4, 5 తరగతులను సమీప ఉన్నత పాఠశాలలకు తరలించడానికి వ్యతిరేకించారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 117 జీవోను రద్దు చేసి పాఠశాలల పునఃనిర్మాణ ప్రక్రియ చేపడుతామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తామని హామీ ఇచ్చిందని, కానీ అధికారులు తీసుకుంటున్న అసంబద్ధమైన నిర్ణయాలతో నేడు మళ్లీ గతంలో కంటే మూడింతలు ఎక్కువగా తరగతుల విలీన ప్రక్రియను చేపట్టడానికి తొందర పడుతున్నారన్నారు. దీనివలన గ్రామీణ ప్రాంతాలలో బేసిక్‌ ప్రైమరీ స్కూల్‌ వ్యవస్థ నిర్వీర్యం చేసే విధంగా ఉందన్నారు. ఏకోపాధ్యాయ పాఠశాలలు మరిన్ని పెరగడానికి దోహదం చేసే విధంగా ఉందన్నారు. 7, 8ఏళ్ల బాలురు, బాలికలు ఉన్న ఊరిలో బడిని వదిలివేసి 3 కిలోమీటర్ల దూరంలోని బడులకు సురక్షితంగా వెళ్ళి రాగలరా అని ఆలోచించాలన్నారు. ఏమైనా ఆపద, ప్రమాదాలకు పిల్లలు లోనైతే అధికారులు బాధ్యత తీసుకుంటారా అని ఆయన ప్రశ్నించారు. మోడల్‌ ప్రైమరీ స్కూల్‌ అనేది 60 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలకు మాత్రమే వర్తింపజేయాలని కోరారు. మండలానికి ఒక ఉన్నత పాఠశాలలో సమాంతర తెలుగు మాధ్యమాన్ని ప్రవేశపెట్టాలన్నారు. ఉపాధ్యాయుల సెలవుల వినియోగంపై రాద్ధాంతం తగదని, పాఠశాలల్లో విద్యార్థుల ఎన్‌రోల్‌ మెంట్‌పై రెవెన్యూ శాఖ జోక్యం మంచిది కాదన్నారు.

చీనీచెట్ల నరికివేత

- టీడీపీ నాయకుల మధ్య విభేదాలు
- ఆధిపత్యం కోసం టీడీపీ నాయకుల ఆరాటం
- పల్లెల్లో ఫ్యాక్షన్‌ కు దారి తీసే పరిస్థితి



నరికిన చీనీచెట్లను పరిశీలిస్తున్న పోలీసులు

తొండూరు : అధికార తెలుగుదేశం పార్టీలో రోజు రోజుకు వర్గ విభేదాలు తారాస్థాయికి చేరుకున్నాయి. ప్రశాంతంగా ఉన్న పల్లెల్లో వర్గ విభేదాలవల్ల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. చివరికి కన్నబిడ్డల్లా పెంచి పోషించుకుంటున్న చీనీచెట్లను సైతం నరుక్కుంటున్నారు. పోలీసుల తెలిపిన మేరకు.. ఇనగలూరు గ్రామంలో గతంలోనే ఫ్యాక్షన్‌ గ్రామం ఒకప్పుడు ఫ్యాక్షన్‌ గ్రామమైనప్పటికి ఈ మధ్య కాలంలో ప్రశాంతంగా ఉన్నారు. దీంతో గత నాలుగు రోజుల క్రితం ఇనగలూరు టీడీపీ నాయకుడు దస్తగిరిరెడ్డిపై అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు బాల ఓబుళరెడ్డి కుమారులు దాడి చేశారు. ఈ దాడిలో దస్తగిరిరెడ్డికి తీవ్ర గాయాలైన విషయం విదితమే. అయితే దీనిపై తమ నాయకులపై దాడి చేస్తారన్న కోపంతో అదే గ్రామానికి చెందిన దస్తగిరెడ్డి అనుచరులు బాల ఓబుళరెడ్డికి చెందిన మూడు ఎకరాలలో ఉన్న రెండేళ్ల చీనీ మొక్కలను గురువారం రాత్రి నరికినట్లు బాల ఓబుళరెడ్డి కుమార్తె ఈశ్వరమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అనంతరం ఈశ్వరమ్మ మీడియాతో మాట్లాడుతూ తమకు గ్రామంలో తమ గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు దస్తగిరెడ్డి అనుచరులు తమ ఇంట్లోకి వెళ్లి ఇంట్లో ఉన్న టీవీ, సామగ్రితోపాటు తదితర వాటిని ధ్వంసం చేశారని, అలాగే గురువారం రాత్రి కూడా తమ పొలానికి చెందిన మూడు ఎకరాలలో ఉన్న చీనీ చెట్లను, బోరు బావులను, విద్యుత్‌ మోటార్లను ధ్వంసం చేశారని తెలిపింది. ఈ సంఘటనపై పులివెందుల రూరల్‌ సీఐ వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయం తెలుసుకున్న సీఐ వెంకటరమణ ఇనగలూరు గ్రామానికి చేరుకుని బాల ఓబుళరెడ్డి పొలానికి వెళ్లి నరికిన చీనీచెట్లను, డ్రిప్‌ పరికరాలను పరిశీలించారు.

బాధితులిద్దరూ ఒకే వర్గానికి చెందినవారే.. : తొండూరు మండలం ఇనగలూరు గ్రామంలో గత మూడు రోజులుగా నెలకొన్న సంఘటనలో ఇరువర్గాలకు చెందిన బాధితులు తెలుగుదేశం పార్టీకి చెందినవారే. అందులోనూ ఇరు వర్గాలకు చెందిన వారు టీడీపీకి చెందిన ఒక నాయకుడి వర్గం వారే. ఆ నాయకుడు వీరి మధ్య విభేదాలను పరిష్కరించడంలో విఫలమయ్యారని పలువురు గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.

మీ సేవలు చిరస్మరణీయం



ఆర్‌ఎస్‌ఐ డి.వి సుబ్బారెడ్డిని సన్మానిస్తున్న పోలీసు అధికారులు

కడప అర్బన్‌ : దాదాపు 35 సంవత్సరాల పాటు అంకితభావంతో పోలీసుశాఖకు అందించిన సేవలు శాఖ ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్‌) కె. ప్రకాష్‌బాబు పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ ఈ.జి అశోక్‌కుమార్‌ ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో పదవీవిరమణ పొందిన పోలీసు అధికారులను అదనపు ఎస్పీ ఘనంగా సన్మానించారు. జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ మాట్లాడుతూ కుటుంబ జీవితాన్ని త్యాగం చేసి నిబద్ధతతో విధులు నిర్వర్తించినందుకు పోలీసుశాఖ తరపున కృతజ్ఞతలు తెలిపారు. విధుల్లో చేరిన నాటికాలంలో అప్పటి పరిస్థితులను తట్టుకుని కుటుంబానికి దూరంగా ఉంటూ విధులు నిర్వర్తించడం మామూలు విషయం కాదన్నారు. పదవీ విరమణ తరువాత కుటుంబ సభ్యులతో గడుపుతూ ఆరోగ్యంపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (ఏఆర్‌) బి. రమణయ్య, డి.పి.ఓ ఏ.ఓ జ్యోతి, ఆర్‌ఐలు టైటస్‌, శివరాముడు, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్‌, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్‌ పాల్గొన్నారు. పదవీవిరమణ పొందిన పోలీసు అధికారులలో కడప డి.ఎ.ఆర్‌ ఆర్‌.ఎస్‌.ఐ డి.వి సుబ్బారెడ్డి, కడప చిన్నచౌకు పిఎస్‌ హెడ్‌ కానిస్టేబుల్‌ (హెచ్‌.సి.1414)లు ఉన్నారు.

పోలీసుశాఖకు మంచిపేరు తీసుకురండి



గౌరవవందనం స్వీకరిస్తున్న జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్‌)కె. ప్రకాష్‌బాబు



పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బంది

- సమష్టి విధులతో ప్రజలకు మెరుగైన సేవలు
- ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి
- జిల్లా అదనపు ఎస్పీ ప్రకాష్‌బాబు

కడప అర్బన్‌ : క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ జిల్లా పోలీసుశాఖకు మంచిపేరు తీసుకురావాలని జిల్లా అదనపు ఎస్పీ కె. ప్రకాష్‌బాబు పిలుపునిచ్చారు. జిల్లా సాయుధ పోలీసు బలగాలకు రెండు వారాలపాటు నిర్వహించిన ‘మొబిలైజేషన్‌’ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. స్థానిక పోలీసు పరేడ్‌ మైదానంలో శుక్రవారం నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ఈ.జి అశోక్‌కుమార్‌ ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ (అడ్మిన్‌) కె. ప్రకాష్‌బాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా పరిశీలన వాహనంపై వెళ్లి ఏ.ఆర్‌. ప్లటూన్‌ను పరిశీలించారు. ఆ తరువాత ప్లటూన్‌ల నుంచి గౌరవవందనం స్వీకరించారు. అనంతరం కె. ప్రకాష్‌బాబు మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షించడంలో రాష్ట్రంలోనే జిల్లా పోలీసులకు మంచిపేరుందన్నారు. ఇందులో ఏ.ఆర్‌ పోలీసుల పాత్ర కీలకంగా ఉందన్నారు. ప్రస్తుతం జిల్లా ప్రశాంతంగా ఉందంటే గతంలో పనిచేసిన అధికారుల, సిబ్బంది త్యాగాలే కారణమన్నారు. ఏఆర్‌ సిబ్బందికి ప్రతి ఏటా మొబలైజేషన్‌ కార్యక్రమం నిర్వహించి విధుల్లో నైపుణ్యం, ఫిజికల్‌ ఫిట్‌నెస్‌ను మెరుగుపరచడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఉద్యోగంలో చేరేముందు శిక్షణలో నేర్చుకున్న తరీదు అంశాలను మరోసారి గుర్తు చేసుకుంటూ మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దుకునేందుకు దోహదం చేస్తాయన్నారు. ఏఆర్‌ పోలీసుల దైనందిన విధులు సవాళ్లతో కూడుకున్నవేనన్నారు. ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. వృత్తిగతంగా, కర్తవ్యం చిన్నదైనా ఎలాంటి లోటుపాట్లు లేకుండా మనస్ఫూర్తిగా నిర్వర్తించాలన్నారు. నైపుణ్యాల పెంపునకు, ఆర్థిక క్రమశిక్షణపై నిపుణులచే మొబిలైజేషన్‌లో భాగంగా ప్రత్యేక తరగతులు నిర్వహించడం జరిగిందన్నారు. బి.డి.టీం, ప్రిజనర్స్‌, ఎస్కార్ట్‌, పి.ఎస్‌.ఓలు, డ్రైవర్లు, తదితర సిబ్బంది విధులు ఈ కోవకు చెందినవే అన్నారు. విధుల్లో నైపుణ్యాన్ని బాగా మెరుగుపరచుకోవాలని పలు మెలకువలు సూచించారు. ఫైరింగ్‌, డ్రిల్‌, కవాతు, మాబ్‌కంట్రోల్‌, ప్రముఖుల బందోబస్తు, తదితర విధులు మరింత సమర్థవంతంగా ఎలా నిర్వహించవచ్చో దిశానిర్దేశం చేశారు. సిబ్బంది సంక్షేమంలో భాగంగా పలు చర్యలు తీసుకుంటున్నామనీ పేర్కొన్నారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. డీ-మొబిలైజేషన్‌ పరేడ్‌ను క్రమశిక్షణతో అద్భుతంగా చేశారని పరేడ్‌ కమాండర్‌ వీరేష్‌ను జిల్లా అదనపు ఎస్పీ అభినందించారు. మొబిలైజేషన్‌ ప్రక్రియలో కీలకంగా విధులను నిర్వర్తించిన అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఏ.ఆర్‌ అదనపు ఎస్పీ బి. రమణయ్య, ఏ.ఆర్‌. డీఎస్పీ శ్రీనివాసరావు, ఆర్‌ఐలు ఆనంద్‌, వీరేష్‌, శివరాముడు, టైటస్‌, శ్రీశైలరెడ్డి, ఆర్‌ఎస్‌ఐలు, ఏ.ఆర్‌. సిబ్బంది పాల్గొన్నారు.

శాస్త్రీయ పద్ధతిలో లేగదూడలను పెంచాలి

బద్వేలు అర్బన్‌ : పాడిరైతులు పశువైద్యాధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ లేగదూడలను శాస్త్రీయ పద్ధతిలో పెంచడం ద్వారా అధిక లాభాలు ఆర్జించవచ్చని పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి డాక్టర్‌ శారదమ్మ పేర్కొన్నారు. మండల పరిధిలోని పొట్టిగారిపల్లె గ్రామంలో శుక్రవారం రాష్ట్రీయ గోకుల్‌మిషన్‌, పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో కృత్రిమ గర్భధారణ ద్వారా పుట్టిన లేగదూడల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాడి రైతులు పశువుల పెంపకంలో జాగ్రత్తలు పాటించడంతో పాటు సకాలంలో వ్యాక్సిన్లను తగు మోతాదులో వేయాల న్నారు. అనంతరం పశువులలో ఎదకు రావడానికి, లింగ నిర్ధారిత వీర్యం వలన కలిగే ఉపయోగాలపై అవగాహన కల్పించారు. ప్రదర్శనలో 37 లేగదూడలు పాల్గొనగా ఆరోగ్యవంతంగా ఉన్న లేగదూడలకు మొదటి, రెండవ, మూడవ బహుమతులను అందజేశారు. పశుసంవర్ధకశాఖ ఉప సంచాలకులు డాక్టర్‌ రమణయ్య, డాక్టర్‌ శరత్‌కుమార్‌, డాక్టర్‌ పవన్‌కుమార్‌ పాల్గొన్నారు.



లేగదూడల ప్రదర్శనను పరిశీలిస్తున్న పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి శారదమ్మ